మినీకథలు

ట్రింగ్....ట్రింగ్

ట్రింగ్....ట్రింగ్

సుజాత ఫోన్ దగ్గరికి వచ్చి రిసీవర్ అందుకుంది.

హలో సుజాతా స్పీకింగ్.

'హలో ఏం చేస్తున్నారు?' ఆంగ్లంలో ప్రశ్నించింది అవతలి కంఠం.

ఆ గొంతు అతనిదేనని గుర్తించింది సుజాత.

మీ గొంతు చాలా తియ్యగా వుంటుంది.

సారీ.... రాంగ్ నంబర్. రిసీవర్ క్రెడిల్ మీద వుంచింది సుజాత. గత నాలుగు రోజులుగా రోజుకు కనీసం ఆరు సార్లయినా ఫోన్ చేస్తూ తనని విసిగిస్తున్నాడు. ఎవరతను? ఎందుకిలా తనని వేధిస్తున్నాడు? సుజాత మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. ఇక ఉదాసీనం వహిస్తే లాభం లేదు. భర్తకి ఈ విషయాన్ని తెలియజేయాలనుకొంది.

ఆ రోజు భర్తతో ఆ రాంగ్ నంబరు ఫోన్ గురించి వివరంగా చెప్పింది. సుజాత చెప్పినదంతా విన్నాడు ఆమె భర్త భరత్. త్వరలో ఈ సమస్యని పరిష్కరిస్తానని సుజాతకి ధైర్యం చెప్పాడు.

* * *

భరత్ వెస్ట్ జర్మనీ సైమన్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆ రోజు సుజాత ఆనందానికి పట్ట పగ్గాల్లేవు. ఆమె ఆనందానికి కారణం— ఆ ఇంట్లో కొత్తగా అమర్చబడిన ఫోన్. కొత్తగా అమర్చబడిన ఆకొత్తరకం ఫోన్‌ని సుజాత భర్త పనిచేసే కంపెనీవారు కనిపెట్టినందువల్ల ఆమెకు మరింత గర్వకారణంగా వుంది. సుజాత ఆ ఫోన్‌ని చేతితో పదేపదే తడుముతూ మురిసిపోతూండగా—

ట్రింగ్.... ట్రింగ్....

ఉలిక్కిపడింది సుజాత. వెంటనే సర్దుకుని రిసీవర్ అందుకుంది.

'హలో....'

హలో హౌ ఆర్ యు? అతను ప్రశ్నించాడు.

"మీ తియ్యటి గొంతు వినాలని మీకు ఫోన్ చేస్తున్నా." మళ్ళీ అతనే అన్నాడు.

సుజాత కళ్ళు టి.వి. స్క్రీన్‌పై కనిపిస్తున్న ఆ వ్యక్తిని పరిశీలిస్తున్నాయ్.

"ఈ రోజు మీరు చాలా ఆనందంగా కనిపిస్తున్నారు. అందుకు కారణం...."

"మీకీ సంగతి తెల్సా?" అతని మాటలకి మధ్య అడ్డుతగుల్తూ ప్రశ్నించింది సుజాత.

"ఏ సంగతీ?" అతను సందేహం వెలిబుచ్చాడు.

'అదే! మీరు రోజూ ఇలా ఫోన్ చేసి నన్ను విసిగిస్తున్నారు."

"అయాం సారీ. ఆ రోజు ఫోన్‌లో మీ తియ్యటి గొంతు విన్నప్పటినుంచీ మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తోంది. టి. వి. స్క్రీన్‌పై మిమ్మల్ని చూడగానే మీరు ఇండియన్స్ అని గుర్తించాను."

ఉలిక్కిపడింది సుజాత.

అతను చిరునవ్వు నవ్వాడు.

భారతీయులన్నా భారతీయ సంస్కృతి అన్నా అమితంగా ఇష్టపడతాను. నేను వెస్ట్ జర్మనీ సైమన్ కంపెనీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. మీవారు పని చేసేది కూడా ఆ కంపెనీలోనేగా; మీ కంటే ఒక వారం రోజులు ముందుగా మా ఇంట్లో టి వి. ఫోన్ అమర్చాం. నా పేరు జిమ్మర్. నేను జర్మన్ ని. బైదిబై ఈ వీక్ ఎండింగ్‌న మా యింట్లో పార్టీ వుంది. మీరు తప్పక రావాలి. నేను నా మిసెస్ కలిసి రేపు సాయంత్రం సిక్స్‌థర్టీ (6-30)కి మీ ఇంటికి వస్తాం. ఇన్విటేషన్ ఇవ్వటానికి. భరత్‌గార్కి మా కంపెనీలోనే ఇన్విటేషన్ అందించేస్తానులెండి. మిమ్మల్ని (ఇంతవరకూ) విసిగించినందుకు మరో సారి సారీ చెప్పుకుంటున్నాను. మరిక ఫోన్ పెట్టేస్తున్నాను." టి. వి. స్క్రీన్ బ్లాంక్ అయిపోయింది.

(ఇందలి పాత్రలు కల్పితం)

పాపం ఉపాయం

-ధర్

"ఏయ్ ఇందూ! అర్జంటుగా ఐదు నిముషాల్లో రెడీకా! ఫస్ట్ షో కెళ్తున్నాం. అంటీకి నే చెప్తాగానీ కుంటిసాకులు మరేం చెప్పకు" వున్నపళంగా వూడిపడ్డ నేస్తం 'రాణి'గారి హడావిడి.

"ను వ్వే మో గంటన్నర అవస్థలు పడి వచ్చుంటావ్, అద్దం ముందు. నేను ఓ పది నిముషాలు సరిగ డ్రస్ చేసుకుని నీ వెంట వస్తే నీవు డిమ్ ఐపోతావని ఎక్కడలేని జెలసీ!" తనకన్నా అన్నివిధాలా బావుంటానన్న ధీమా నాచేత అలా అనిపించింది.

తన మనసులోని మాట నాకెలా తెలిసిందా అన్నట్లు ముఖంపెట్టి అంతలోనే సర్దుకొని "రేపు లలితకళా పరిషత్తులో బ్యూటీ కంటెస్ట్ కండక్టు చేస్తున్నారుగాని కొంపదీసి పార్టిసిపేట్ చేసేవు. 'అందాల సుందరి'గా ఎన్నికై మహా పోజుపెట్టెయ్యగలవు. ఊఁఊఁ తెమలవే. అవతల అంటీని కాస్త కాకా పట్టొద్దూ. ఈ సుందరికి పర్మిషన్ గ్రాంట్ చేయించుకుందుకు" తుర్రుమంది మమ్మీ దగ్గరకు.

అప్పటికే స్నానం చేస్తున్నాను కాబట్టి త్వరగా రెడీ అయిపోయి బయటపడ్డాము. రిక్షాఎక్కి నీలంథియేటర్‌కు వెళ్ళమన్నాము. మేం వెళ్ళేప్పటికి న్యూస్ రెవ్యూ జరుగుతోంది. పెద్దగా రష్‌లేదు. వెళ్ళి ఓ కార్నర్‌లో కూర్చున్నాము. సినిమా బిగినయింది.

వాత్స్యాయనుడివారసునిలా వున్నాడు దర్శకుడు. హీరోయిన్ కలగంటూంది చాలా ఘోరంగా- పచ్చిగా, కైపెక్కి, కపెక్కి ఒకరినొకరు పెనవేసుకుపోతున్నారు. దొర్లుతున్నారు. ఐవ కొడ్తున్నారు.

సీరియస్‌గా సినిమా చూస్తున్న నాకు 'రాణి' పిలుపు డిస్టర్బెన్స్ అనిపించి "ఎందుకే" అన్నాను.

"ఇవ్వవే! తర్వాత చెప్తాను" అంది.

నా తలలో వక్కపిన్ను తీసి దానిచేతికిచ్చాను.

హీరో హీరోయిన్లు పొర్లి దొర్లి, అలసి సొలసి మరి అడలేక పాటముగించేశారు. రాణి ఎందుకో ముందుకు వంగి తన కాళ్ళదగ్గరకు చెయ్యి పోనివ్వడం నేను గమనించే లోపల కెవ్వుమన్న కేకకు బాల్కనీ దద్దరిల్లిపోయింది. వెనక్కు తిరిగా— ఒక అందగాని కేకది.

సినిమా మొదలైనప్పటి నుంచి అతను విపరీతంగా ప్రవర్తించాడట. వెనుక నుంచి అతని కాళ్ళతో రాణి కాళ్ళను సయ్యాట లాడ్డం మొదలెట్టాడట. అప్పటికీ రాణి తన కాళ్ళను ముందుకు జరుపుకుని కూర్చుంది. పట్టువదలని విక్రమార్కునిలా యింకా స్త అడ్వాన్సయి సదరు అందగాడు తన బొటన వ్రేలితో రాణి పాదాల దగ్గర నుంచి పిక్కల వరకూ....భరించలేక తలపిన్నుతో కసికొద్దీ అతని పాదంలో బలంగా గ్రుచ్చిందంతే....

కుంటుతూ అతగాడు తుర్రుమంటే విషయం టూకీగా విన్న నలుగురూ నవ్వుకున్నారు—

●

అది ఆంధ్ర పారిస్ నుంచి గుంటూరు పట్టణానికి వెళ్ళే పాసింజర్ రైలు. కదులుతున్న మానవ ప్రదర్శనశాలలా వుంటా రైలు. అందుకు తెనాలి సుబ్బారావు పాట పాడుతున్నాడు రైల్లో. అతడు అద్వైతసిద్ధికోసం పాడటంలేదు-అమరత్వ లబ్ధికోసమూ పాట్టం లేదు. చావకుండా బతకటం కోసం పాడుతున్నాడు. కళ కోసం పాడటం లేదు. చిల్లర కాసుల

కోసం పాడుతున్నాడు. జనం కోసం పాడటం లేదు. తన కోసమే పాడుతున్నాడు. సినిమా పాటలు, భక్తి పాటలు, దేశభక్తి పాటలు, ఆకలి పాటలు అన్నిరకాల పాటలు పాడుతున్నాడు- రెండర్థాల పాటలు తప్ప. జనాన్ని తప్పుకుంటూ, రకరకాల సందళ్ళని తట్టుకుంటూ, పద్మవ్యూహం లాటి రైల్లో గుడ్డి అభిమన్యుడిలా పాడుతున్నాడు. టికెట్ చెకింగ్ స్క్వాడ్ రైడ్ చేస్తున్నారు. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. బియ్యం గుంటూరుకు దొంగ రవాణా అవుతున్నాయి. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. పోలీసులు మామూళ్ళు అడుక్కుంటున్నారు. సుబ్బారావు చేయి జాపి పాడుతూనే వున్నాడు. ప్రయాణీకులు "అమ్మ — అన్న" రాజకీయాలను గురించి పెద్ద గొంతుకులతో చర్చించుకుంటున్నారు. సుబ్బారావు గళం విప్పి పాడుతూనే వున్నాడు. ఆడవాళ్ళు చీరలను గురించి, రిబేట్ల గురించి ముచ్చటించుకుంటున్నారు. సుబ్బారావు ముచ్చటగా పాడుతూనే వున్నాడు సీజన్ టికెట్లపై తిరిగే ఉద్యోగస్తులు చతుర్ముఖ పారాయణం చేస్తున్నారు. సుబ్బారావు గానం చేస్తూనే వున్నాడు. రైలు సాగిపోతూనే వుంది. సుబ్బారావు యాంత్రికంగా పాడుతూనే వున్నాడు.

ఈ రోజే కాదు. గత కొన్ని సంవత్సరాలుగా సుబ్బారావు రైల్లో పాటలు పాడుతూనే వున్నాడు సుంత్రులు మారుతున్నారు. సుబ్బారావు పాడుతూనేవున్నాడు. అందులు హక్కులకోసం అసెంబ్లీ ముందు లాఠీ దెబ్బలు తిన్నారు. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. అంతర్జాతీయ ఏకలాంగుల సంవత్సరం జరిగిపోయింది. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. నాయకులు వాగ్దానాల వర్షాలు కురిపిస్తున్నారు. సుబ్బారావు ప్రవాహంలా పాడుతూనే వున్నాడు.

ఒక్కసారిగా పాడుతున్న పాట ఆగిపోయింది. పొరపాటున సుబ్బారావు ఓ ప్రయాణీకుడి కాలు తొక్కటంతో.

సదరు ప్రయాణీకుడు అగ్గిలా భగ్గుమన్నాడు. బిచ్చగాళ్ళను అనుమతిస్తున్నందుకు రైల్వేవాళ్ళమీద విసుక్కొన్నాడు. బిచ్చగాళ్ళను తమ రాష్ట్రం నుంచి తరిమేస్తున్నందుకు తమిళనాడు ప్రభుత్వాన్ని మెచ్చుకున్నాడు. సుబ్బారావు అందుడు కాదనీ, సుబ్బరంగానే కనబడుతుందనీ, అంతా నటననీ అన్నాడు. కేవలం సోమరితనమన్నాడు. ఈ బిచ్చగాళ్ళు ప్రతి రోజూ తాగుతారనీ, మట్కాజూదం ఆడతారనీ, వీళ్ళకు బ్యాంకు నిల్వలు కూడా వుంటాయనీ అన్నాడు. రైళ్ళలో వీళ్ళకు టికెట్ అవసరం లేదనీ, అసలెవరూ వీళ్ళని టికెట్ అడగరనీ, రైళ్ళు వీళ్ళ సొంతమనీ, వీళ్ళ కోసమే రైళ్ళు వేసారనీ వాపోయాడు. వీళ్ళు రైళ్ళలో, ఎంచక్కా ఏ వూరు చూడాలంటే ఆ వూరు తేరగా పోవచ్చనీ ఈర్ష్య పడ్డాడు. ఈ వుద్యోగాలకంటే, వ్యాపారాలకంటే, వ్యవసాయాలకంటే అడుక్కోవటమంత హాయి లేదన్నాడు. తను బిచ్చగాడిగా పుట్టనందుకు చాల బాధపడ్డాడు.

సుబ్బారావు గాజు కళ్ళతో ఓ జీవం లేని నవ్వు నవ్వాడు. "బాబూ మీరంత బాధపడ మాకండి. మీరందంతా అచ్చరాలా నిజం. అందుకని మీ ఆస్తీ-పాస్తీ, పొలం-పుట్రా డబ్బు-దస్కం నా మొఖాన పారేయండి. ఆ బాధలేంటో నేనే పడతాను. నా జోలె-చిడతలు తవరికిస్తాను. అయిగా రైల్లో అడుక్కు తింటా రోజూ సారా తాగుతా, జూదం ఆడతా, బ్యాంకీ నిలవ పెంచుకుంటూ సుకపడిపోండి!"

ఆ దెబ్బతో సదరు ప్రయాణీకుడికి— కంటి చూపేగాని నోటి మాట పెగల్లేదు. చీమ చిటుక్కుమంటే వినవడేంత నిశ్శబ్దం అయిపోయింది రైలుపెట్టె.

రైలు మాత్రం పరుగెడుతూనే వుంది.

●